క్లుప్తంగా

ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలి

వెంకటాపురం(కె): ఏటూరునాగారం కేంద్రం గా ప్రభుత్వం నేతకాని ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలని నేతకాని రక్షణ సంఘం మండల ప్రచార కార్యదర్శి జాడి సతీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నేత కాని రక్షణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో నివసిస్తున్న నేతకాని కులస్తులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.నేతకాని కులస్తులకు ఏజెన్సీలో గిరిజనులతో పాటు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు గోగు నాగరాజు, చిన్న సమ్మయ్య, జాడి నవీన్, సతీస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



మంగపేట : స్థానిక కొమరంభీం విగ్రహం వద్ద టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు గొప్ప సమ్మారావు ఆధ్వర్యంలో ఆ సంఘ శ్రేణులు శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సమ్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చింత కృష్ణమూర్తి, కొండ చెంచయ్య, మండల అధ్యక్షుడు గుండం పురుషోత్తం, కార్యదర్శులు హన్మంతరావు, నాగేశ్వర్ రావు, సమ్మయ్య, వేణు, జబ్బ రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వాజేడు: మండల పరిధిలోని బొల్లారంలో శనివారం పలు అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ తల్లాడి పుష్పలత, ఎంపీపీ శ్యామల శారద శంకుస్థాపన చేశారు. గ్రామంలో సీసీ డ్రెయినేజీ నిర్మాణం కోసం మండల పరిషత్ నిధుల నుంచి రూ.3 లక్షలను మంజూరు చేశారు. ఆ నిధులతో ఈ డ్రెయినేజీని నిర్మించనున్నారు. అందుకు గాను శనివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని యాకన్నగూడెం సమీపంలో శనివారం వెంకటాపురం ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల నుంచి, ఏటూరునాగారం, వాజేడు మండలాల నుంచి వచ్చి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీ చేపట్టారు. అనుమానిత వ్యక్తులు తారస పడితే వారి నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. తనిఖీల్లో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని బయ్యక్కపేటకు చెందిన చందా మహేశ్‌ను జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి శనివారం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సర్పంచ్ గుర్రం రమ సమ్మిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐలయ్య, సీనియర్ నాయకుడు పత్తి గోపాలరెడ్డి, జాగృతి మండల అధ్యక్షురాలు పుర్రి స్వరూప, నాయకులు ఝెట్టి జగదీష్ ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మహాముత్తారం : తెలంగాణ పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు గతంలో పాస్ బుక్కులు వచ్చిన రైతులు కూడా రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టా పాస్‌పుస్తకాలతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌ను వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

నెహ్రూ సేవలు చిరస్మరణీయం



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు : భారత తొలి ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యానంతరం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నెహ్రూ 59వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతావని పురోగతికి పునాదులు వేసిన దార్శనికుడిగా గుర్తింపు పొందారని అన్నారు. 1951లో పంచవర్ష ప్రణాళికను రచించి వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులను పొందుపర్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. నెహ్రూ ఆశయ సాధనకోసం ప్రతి కార్యకర్త ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ అనీల్, మార్క విజయ్‌కుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కో ఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, నల్లెల భరత్, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, జిల్లా నాయకుడు చింతనిప్పుల భిక్షపతి, ఎంపీటీసీ సభ్యుడు మావురపు తిరుపతిరెడ్డి, తక్కెళ్లపల్లి రాజు, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టు, రచయితకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వెంకటాపురం(ఎం): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన జర్నలిస్టు, రచయిత సందబాబు క్యాన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితం కాగా విద్య ఫౌండేషన్, వరంగల్‌కు చెందిన కవి మిత్రులు చేయూతనిచ్చారు. రూ. 20 వేలు జమచేసి శనివారం సందబాబుకు అందజేశారు. అతని పరిస్థితి తెలుసుకొని వైద్య చికిత్స నిమిత్తం చేయూతను అందించినట్లు విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, అడ్వకేట్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సందబాబు సమాజానికి అనేక సేవలు చేశారని, ముఖ్యంగా ఒంటరి మహిళల హక్కుల సాధన కోసం నిత్యం పోరాటం చేశాడని అన్నారు. కవిగా, రచయితగా రచనలు రాస్తూనే సమాజం కోసం నిరంతరం కృషి చేశాడని పేర్కొన్నారు. సందబాబు త్వరగా కోలుకోవాలని, క్లిష్ట పరిస్థితులలో ఉన్న అతడిని మానవతా దృక్పథంతో అందరూ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరామర్శించిన వారిలో కవులు నాగబెల్లి జితేందర్, సిరాజోద్దీన్, బాలబోయిన రమాదేవి, జ్యోతిరాణి, కలకోట్ల నరేందర్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను దీర్ఘకాలికంగా విడుదల చేయకపోవడం సరికాదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) మండల అధ్యక్షుడు టీవీ వీరభద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులకు హక్కుగా రావల్సిన ఆర్థిక ప్రయోజనాలను దీర్ఘకాలికంగా పెండింగ్ పెడుతూ చెల్లించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులకు చెందిన మెడికల్, జీపీఎఫ్, సరెండర్ తదితర బిల్లులు దీర్ఘకాలికంగా విడుదల కాకపోవడంపై ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే నూతన పీఆర్‌సీ కమిటీని సకాలంలో నియమించాలన్నారు. గత పీఆర్‌సీలోని పెండింగ్ జీఓలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఐటీడీఏ ఎదుట గిరిజన నాయకుల ఆందోళన



ఐటీడీఏ ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

ఏటూరునాగారం: వెంకటాపురం(కె) మండలంలోని ఇప్పగూడెం, పూజారిగూడెం, అంకన్నగూడెంలో పెసా గ్రామ సభలు పెట్టాలని ఆదివాసీ నాయకులు బొగ్గుల సురేష్, మడకం విక్రమ్, సోడి సిద్ధార్థ, సోడి గోపి, సోడి నర్సింహరావు డిమాండ్ చేశారు. శనివారం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేపట్టి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీఓ అంకిత్‌కు సమర్పించారు. పై గ్రామాల్లో ఎలాంటి సభలు లేకుండానే ఇసుక క్వారీలు చేపట్టాలని చూస్తున్నారన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు న్యాయం చేయాలని పీఓను వేడుకున్నారు. ఈ విషయంపై పీఓ స్పందిస్తూ అధికారులతో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు



కన్నాయిగూడెం : మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌ను కలిసి సన్మానించారు. నూతనంగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పార్టీ కార్యాలయంలో కన్నాయిగూడెం మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు కార్యకర్తలతో కలిసి కలిశారు. వీరి వెంట వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్ దుర్గారావు తదితరులు ఉన్నారు.

ఎండవేడికి బైక్ నుంచి మంటలు

● అప్రమత్తమై మంటలను ఆర్పేసిన స్థానికులు



బైక్‌లో నుంచి చెలరేగుతున్న మంటలు

ఏటూరునాగారం: వేసవికాలం కావడంతో ఎండ తీవ్రంగా ఉండడం వల్ల ఓ ద్విచక్రవాహనం నుంచి మంటలు అంటుకొని మండుతుండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వాజేడు మండలానికి చెందిన కోరం సాయి పని నిమిత్తం తన ద్విచక్ర వాహనం (పల్సర్ 220 సీసీ)పై ఏటూరునాగారానికి వచ్చాడు. బస్టాండ్ సమీపంలో ఓ షాపు వద్ద పార్క్ చేశాడు. కాగా ఎండవేడి అధికంగా ఉండడంతో ద్విచక్రవాహనంలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన చూసిన స్థానికులు అప్రమత్తమై బొంత, నీటిసాయం , ఇసుక పోసి మంటలను ఆర్పేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మహదేవపూర్: మండలంలోని బొమ్మాపూర్, సూరారం, బెగుళూర్, ఏన్కపల్లి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారిణి విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. సీసీ రోడ్లు, సైడ్ కాలువలు, నర్సరీలతో పాటు మిగతా పల్లె ప్రగతి పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఎంపీఓ ప్రసాద్, ఇంజనీరింగ్ అధికారి రవీందర్ ఉన్నారు.

కళారూపంలో సందేశం అందించాలి

● కాంగ్రెస్ భూపాల్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల(గోరికొత్తపల్లి) : కళారూపంలో సందేశాన్ని ప్రజలకు అందిస్తే చేరుతాయని కాంగ్రెస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం గోరికొత్తపల్లిలో చిరుతల రామాయణం ప్రారంభం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటకాల ద్వారా భవిష్యత్ తరాలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసి రక్షించవచ్చన్నారు. నేటి సమాజంలో టీవీ సెల్‌ఫోన్‌లతో సంస్కృతి, సంప్రదాయాలను పూర్తిగా మర్చిపోతున్నారని, గ్రామాల్లో నాటకాల ద్వారా కొంతవరకైనా దేశ సంప్రదాయాలపై అవగాహన కల్పించవచ్చన్నారు. అనంతరం నాటకంలోని పాత్రదారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, నాయకులు వీరేందర్, ప్రభాకర్, ఓంప్రకాష్, తిరుపతి, భిక్షపతి, ప్రేమ్‌జీ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం



ఐకేపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి గండ్ర పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గత వారం, పది రోజుల నుంచి వరి ధాన్యం ఐకేపీ కేంద్రాలకు వస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనడం లేదని అన్నారు. వాతావరణ పరిస్థితులు మారుతూ ఉండటంతో వర్షం పడితే తమ పరిస్థితి ఏంటని రైతులు బాధపడుతున్నారని జీఎస్సార్ అన్నారు. వరి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు అండగా ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ ఉంటుందన్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయకుంటే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని గండ్ర హెచ్చరించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ బండి సుదర్శన్ గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోలినేని లింగారావు, మొగుళ్ళపల్లి టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్, ముఖ్య నాయకులు తక్కళ్ళపల్లి రాజు, ఒనపాకల ప్రసాద్, యండి రఫీ, నడిగోటి రాము, పసరగొండ మహిపాల్ తదితరులు ఉన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

టేకుమట్ల(రేగొండ): రేగొండలో ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అంకం రాజేందర్ శనివారం తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరుకానున్నట్లు తెలిపారు.

మండుతున్న సూర్యుడు



గొడుగుతో బయటకు వస్తున్న వృద్ధుడు

వాజేడు: ఎండలు మంట లేపుతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో 10 దాటిన తర్వాత ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రావడం లేదు. అత్యవసరమైతే తప్ప బయటకు రాలేని పరిస్థితి కనిపిస్తుంది. రహదారులు మొత్తం నిర్మానుష్యంగా మారాయి. శనివారం ఒక పెద్దాయన అత్యవస పనిపై బయటకు రావాల్సిన స్థితిలో గొడుకు వేసుకుని వచ్చాడు.

బహిరంగ సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

ఏటూరునాగారం: జూన్ 4న కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కొమురంభీం నగర్‌లో పొడియం ఉంగయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి రవీందర్ హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక బలం ఉంది కదా అని ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. కులాలు, మతాల పేరుతో కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య చిచ్చులు పెట్టి రాక్షసానందం పొందడం ఏమిటని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలనే సీపీఐ ప్రజాగర్జన పేరుతో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాసర్, నాయకులు ఉంగయ్య, ఇరుప లింగయ్య, కురుసం లింగయ్య, నీలమ్మ, మడకం పాపారావు, ఇరుప లక్ష్మి, కురుసం సుశీల, ముడెం రాజు, పుల్లమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇసుక రీచ్ నిర్వహణకు గ్రామసభలు



గ్రామసభకు హాజరైన సొసైటీ సభ్యులు



గ్రామసభలో మాట్లాడుతున పీసా జిల్లా కోఆర్డినేటర్ పభాకర్

వెంకటాపురం (కె): మండల పరిధిలోని మొర్రవానిగూడెం, ఒంటిచింతలగూడెం, పూజారిగూడెం గ్రామాల్లో శనివారం అధికారులు ఇసుక రీచ్‌ల నిర్వహణ కోసం పీసా గ్రామసభలు నిర్వహించారు. ఒంటిచింతలగూడెం పీసా గ్రామసభలో ఇసుక రీచ్ నిర్వహణ ముత్యాలమ్మ గిరిజన సొసైటీకి ఇవ్వాలని, మొర్రవానిగూడెం ఇసుక రీచ్ నిర్వహణ గోదావరి గిరిజన సొసైటీకి ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కాగా పూజారిగూడెం ఇసుక రీచ్ నిర్వహణ కోసం నిర్వహించాల్సిన గ్రామ సభను ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ అంకిత్ ఆదేశాల మేరకు అధికారులు వాయిదా వేసినట్లు ప్రకటించారు. గ్రామసభ తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పీసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఎంపీడీఓ అడ్డూరి బాబు, మొర్రవానిగూడెం, మడకం సర్పంచ్‌లు మడకం సారయ్య, కారం కన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు శృతి, రాజకుమారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



గోవర్ధన్‌కు సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై

ఏటూరునాగారం: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి పోలీసులు సెల్‌ఫోన్‌ను అప్పగించారు. స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం. శనివారం మండల కేంద్రానికి చెందిన గోవర్ధన్ మొబైల్‌ఫోన్ స్థానిక డిగ్రీ కళాశాల ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎక్కడో పడిపోయింది. ఈ విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో సెల్‌ఫోన్ ఎక్కడ ఉందని కనిపెట్టామన్నారు. మొబైల్‌ను స్వాధీన పర్చుకొని బాధితుడికి అప్పగించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు వారి మొబైల్ ఫోన్‌లు పోయిన వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. సీఈఐఆర్ ద్వారా కనిపెట్టి బాధితులకు అందిస్తామన్నారు.

వ్యాధుల నివారణకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

ఎస్ఎస్‌తాడ్వాయి : పశువుల వ్యాధుల నివారణకు పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం తాడ్వాయి, నర్సింగాపూర్ గ్రామాల్లోని పశువులకు జబ్బ, గొంతువాపు నివారణకు టీకాలు వేశారు. గ్రామాల్లోని 180 పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాశాల అసిస్టెంట్ రాజు తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులకు సుమరుగా 103 డీగ్రీల జ్వరం , అకస్మికంగా గొంతు వాపు వస్తుందన్నారు. పశువుల ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. ఈ టీకాలు వేయడంతో గొంతు, జబ్బువాపు వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చన్నారు.గోపాలమిత్ర రాంబాబు ఉన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చిన కేసీఆర్

● బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తాటి కృష్ణ

మంగపేట: బంగారు తెలంగాణ పేరుతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో బీజేపీ మండల అధ్యక్షుడు లోడే శ్రీనివాస్ అధ్యక్షతన పార్టీ మండల కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ, మండల ఇన్‌చార్జ్ తక్కెళ్ళపల్లి దేవేందర్ మాట్లాడుతూ ఎన్నో ఆశలతో సాధించుకున్న తెలంగాణ నలుగురి చేతుల్లో బందీ అయిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల లక్ష్యంతో ఏర్పడిన తెలంగాణ నీళ్లు లేక నిధులు లేక నియామకాలు చేపట్టక అభివృద్ధి కుంటు పడిపోయిందన్నారు. ప్రజలను మభ్యపెడుతూ తెలంగాణ అభివృద్ధిని విస్మరించి ప్రజలను చిన్న చూపు చూస్తున్నాడని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ప్రజల ఆకాంక్షలు, ఆశలు నెరవేరుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తిమ్మంపేట బూత్ కమిటీ అధ్యక్షుడు జాడి రాంబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అన్నారపు సతీష్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె జనార్ధన్, కార్యదర్శి పాదెం రవీందర్, జిల్లా నాయకులు ఎండీ యాకూబ్‌పాష, సురేష్, వెంకట్ రెడ్డి, సురేష్, సుధాకర్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

మల్హర్: మండలంలోని మల్లంపల్లిలో కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు, మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా పూజారి తిరుమల, అధ్యక్షురాలిగా పిట్టల కోమలత, ఉపాధ్యక్షురాలిగా అంగోతు సమ్మక్క, ప్రధాన కార్యదర్శిగా పాలకుర్తి స్వాతి, కోశాధికారిగా బి.లత, సమైక్యతా కార్యదర్శి ప్లకుర్తి సునీత, ప్రచారా కార్యదర్శిగా బానోత్ లలితతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీపీసీవి మహిళా సెక్రటరీ, ములుగు ఇన్‌చార్జ్ అంగోతు సుగుణ, జిల్లా అధికార ప్రతినిధి అజ్మీర జంపన్న, సర్పంచ్ అజ్మీర ప్రేమలత, ఉపసర్పంచ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు